# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక



## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి ఫోన్: 93910 89608



సంపుటి: 4 | సంచిక: 7 | పేజీలు: 6 | వెల: రూ.3/- | మంగళవారం 21 ఏప్రిల్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి




# 'కేసీఆర్ కాస్కో..

## 2029 ఎన్నికల్లో నువ్వో నేనో తేల్చుకుందాం

ప్రతిపక్ష హోదా కూడా ఊడగొట్టకపోతే నా పేరు మార్చుకుంటా

2034 వరకు రాష్ట్రంలో అధికారం కాంగ్రెస్‌దే

నస్తూరుపల్లి సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపాలనా పోవాలా?పాపాల భైరవుడి పాలన కావాలా?

జీవన్‌రెడ్డితోపాటు తెలంగాణ ప్రజలు ఆలోచించాలి

14 సార్లు బీఫామ్ ఇచ్చి ఓడినా, గెలిచినా మద్దతు పలికితే సంయమనం పాటించకపోవడం అప్రజాస్వామికం కాదా?

వైఎస్సార్, డీఎస్‌లా నేను, మహేశ్‌గౌడ్ పనిచేస్తాం

రెండో విడత రైతు భరోసా రూ.5,700 కోట్లు విడుదల

**భూపాలపల్లి, ఏప్రిల్ 20 (ప్రభాత ఉదయం)**

'కేసీఆర్ కాస్కో.. 2029 ఎన్నికల్లో నువ్వో నేనో తేల్చుకుందాం. నీకున్న ఈ ప్రతిపక్ష హోదా కూడా ఊడగొట్టకపోతే నా పేరు మార్చుకుంటా. రాష్ట్రంలో 2034 వరకు కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుంది. అసలు ఈ చట్టాలే లేకుంటే, అటవిక రాజ్యమే అయితే మిమ్మల్ని చెట్టుకు ఉరేసినా తప్పులేదు.



కాంగ్రెస్ కార్యకర్తల తరఫున సవాల్ చేస్తున్నా..వచ్చే ఎన్నికల్లో వంద మీటర్ల లోతున పాతరేస్తాం..'అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. కొందరు స్వార్థపర నాయకులు ప్రజాపాలన పోయి పాపాల భైరవుల పాలన రావాలని కోరుకుంటున్నారని, అలాంటి వారికి ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సోమవారం సీఎం.. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, డి.శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్ గౌడ్ తదితరులతో కలిసి జేఎస్ భూపాలపల్లి జిల్లాలో పర్యటించారు. కాళేశ్వర ముక్తేశ్వరస్వామి ఆలయంలో పూజలు, అభివృద్ధి పనులకు శంకుస్థాపన ..మిగతా 2లో

# కాంగ్రెస్ దోపిడీతో ఏ ఒక్కరూ సంతృప్తిగా లేరు

పొదరిల్లు లాంటి రాష్ట్రాన్ని అప్పగిస్తే కేసీఆర్ చావాలా?

ఈ వెధవలు చావాలని అనుకుంటే నేను చస్తానా?

కాంగ్రెస్ దోపిడీతో ఏ ఒక్కరూ సంతృప్తిగా లేరు

పనిచేయని వారిని లాగులు పగిలేదాకా సంపాలి

కేసీఆర్ సభలు పెడితేనే రైతుబంధు కిస్తీ ఇస్తారా?

అధికారంలోకి వచ్చిన వెంటనే హైడ్రా రద్దు చేస్తాం

జీవన్‌రెడ్డికి బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి పదవి

ప్రజలకు మంచి జరగాలనే బయటకు రాలేదు

జగిత్యాలలో జరిగిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్



**జగిత్యాల, ఏప్రిల్ 20 (ప్రభాత ఉదయం)**

'కట్టిన ఇల్లు.. పెట్టిన పొయ్యిలా రాష్ట్రాన్ని అప్పగిస్తే కేసీఆర్ చావాలా..? నువ్వు వేయి జన్మలెత్తినా చావను.. పిల్లి శాపాలకు ఉట్టి తెగుతదా..? ఈ వెధవలు చావాలని అనుకుంటే చస్తానా? మీ ఆశీర్వాదాలు ఉంటే అన్ని వర్గాల ప్రజలు గర్వంగా, సంతోషంగా ఉండేలా, అన్ని వర్గాల ప్రజలు బాగుపడేదాకా సేవ చేస్తా. చివరి శ్వాస దాకా 50 ఏండ్ల వారిలా నేనూ, జీవన్‌రెడ్డి ఉత్సాహంతో ముందుకు దూసుకుపోతాం. రాష్ట్రం ఎందుకు బాగుపడదో చూస్తాం' అని బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు వ్యాఖ్యానించారు. జగిత్యాలలో సోమవారం బీఆర్ఎస్ నిర్వహించిన 'ప్రజా ఆశీర్వాద సభ' వేదికగా ఇటీవల కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన మాజీ మంత్రి టి.జీవన్‌రెడ్డి కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. సుమారు ఏడాది తర్వాత ప్రజాక్షేత్రంలో అడుగు పెట్టిన కేసీఆర్ గంట పాటు ప్రసంగించారు.

'తెచ్చిన తెలంగాణలో మంచి, చెడు చూసే బాధ్యత నాకు అప్పగిస్తే కొత్త కుండలో ఈగ చొచ్చినట్లు రాష్ట్ర ఆర్థిక స్థితిపై అవగాహన లేకున్నా నిపుణుల సహాయంతో ..మిగతా 2లో

## కాళేశ్వరం ఆలయ అభివృద్ధి పనులకు

# భూమిపూజ

భూపాలపల్లి జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

కాళేశ్వర ముక్తేశ్వరస్వామిని దర్శించుకున్న సీఎం

రూ.198 కోట్లతో చేపట్టబోయే అభివృద్ధి పనులకు శ్రీకారం



**భూపాలపల్లి, ఏప్రిల్ 20 (ప్రభాత ఉదయం)**

కాళేశ్వరంలోని ఆలయ అభివృద్ధి పనులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూమి పూజ చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి తొలుత కాళేశ్వరంలోని కాళేశ్వర ముక్తేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం రూ.198 కోట్లతో చేపట్టబోయే ఆలయ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి భూమిపూజ చేశారు. అనంతరం మేడిగడ్డ బ్యారేజీకి చేరుకుని, ఎన్డీఎస్ఏ ఛైర్మన్ అనిల్ జైన్‌తో కలిసి బ్యారేజీని పరిశీలిస్తారు. ఇరిగేషన్ అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహిస్తారు. అక్కడి నుంచి కాటారం మండలం నస్తూరిపల్లికి వెళ్తారు. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతారు. ఈ సభలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా రెండో విడత నిధులను విడుదల చేస్తారు.



## రాజస్థాన్ హెచ్‌పీసీఎల్ రిఫైనరీలో అగ్నిప్రమాదం

2

ప్రధాని మోదీ ప్రారంభోత్సవానికి ఒకరోజు ముందు ఘటన

## భారత్, దక్షిణ కొరియా మధ్య సంబంధాలకు

# ప్రజాస్వామ్య విలువలే పునాది

ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 20 (ప్రభాత ఉదయం)**



భౌగోళిక రాజకీయ అస్థిరతల దృష్ట్యా, పెరుగుతున్న వాణిజ్య అంతరాయాల నేపథ్యంలో భారత్- దక్షిణ కొరియాలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. ఇరు దేశాల మధ్య ఉన్న జజ్బూలా (సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం) చర్చలు ప్రారంభించడానికి అంగీకరించాయి. ప్రధాని నరేంద్ర మోదీ, దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్‌ల మధ్య జరిగిన చర్చల అనంతరం ఈ నిర్ణయాన్ని ప్రకటించాయి. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం కోసం కలిసి పనిచేయాలని కూడా ఇరుపక్షాలు తీర్మానించాయి. మూడురోజుల పర్యటన కోసం భారత్‌కు వచ్చిన దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్‌తో ప్రధాని మోదీ దిల్లీలో సమావేశమయ్యారు. సెమీ కండక్టర్ల ..మిగతా 2లో

## జపాన్‌లో భారీ భూకంపం..

# సునామీ హెచ్చరికలు జారీ

జపాన్‌లో 7.4 తీవ్రతతో భారీ భూకంపం..

తీరప్రాంతాలకు సునామీ హెచ్చరికలు


10 అడుగుల ఎత్తున అలలు ఎగసిపడే ఛాన్స్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 20 (ప్రభాత ఉదయం)**

జపాన్ ఉత్తర తీరంలో మరోసారి భారీ భూకంపం సంభవించింది. భూకంప ప్రకంపనల తీవ్రత జపాన్‌లో 7.4గా నమోదైంది. దీంతో సునామీ హెచ్చరికలు జారీ చేశారు. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఎత్తైన ప్రదేశాల్లోనే ఉండాలని అధికారులు పౌరులకు సూచించారు. భూకంపానికి హొక్కైడో, ఆఓమోరి, ఇవాటే ప్రాంతాలు ఎక్కువ ప్రభావితమయ్యాయి.



ఉత్తర జపాన్ తీరానికి దూరంగా పసిఫిక్ మహాసముద్రంలో 10 కిలోమీటర్ల లోతులో సంభవించింది. భూకంపం సంభవించింది. తీర ప్రాంతం హొక్కైడో ప్రాంతంలో గరిష్టంగా మూడు మీటర్ల (10 అడుగులు) మేర అలలు ఎగసి పడొచ్చని జపాన్ మెట్రోలాజికల్ ఏజెన్సీ వెల్లడించింది. స్థానిక కాలమానం ..మిగతా 2లో



## ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు గడువు మరో మూడు రోజులు పొడిగింపు..

**హైదరాబాద్,ఏప్రిల్20(ప్రభాత ఉదయం)**

తెలంగాణలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు గడువును ఇంటర్మీడియట్ బోర్డు పొడిగించింది. ఇంటర్ ప్రథమ,ద్వితీయ సంవత్సరానికి చెందిన రెగ్యులర్ విద్యార్థులతో పాటు,ఫెయిలైన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాయడానికి ఈనెల 23వ తేదీ వరకు పొడిగించినట్లు తెలంగాణ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు.2025-26 విద్యా సంవత్సరానికి గాను నిర్వహించిన ఇంటర్ ప్రథమ,ద్వితీయ పరీక్షల ఫలితాలు ఈనెల 12న విడుదలయ్యాయి.కాగా ఈ పరీక్షలో ఉత్తీర్ణులై మార్కులు ఎక్కువ సాధించాలని భావించే విద్యార్థులు,ఫెయిలైన విద్యారులకు మే13 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు.మే22 నుంచి25 వరకు ప్రాక్టికల్స్,మే26న ఫస్టియర్, సెకండియర్ ఇంగ్లిష్ ప్రాక్టికల్స్, 28న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష, ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష నిర్వహించనున్నారు.

### భారత్, దక్షిణ కొరియా మధ్య సంబంధాలకు

# ప్రజాస్వామ్య విలువలే పునాదీ

**మొదటి పేజీ తరువాయి...**

తయారీ, రక్షణ రంగం, హరిత ఇంధనం, సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం వంటి అంశాలపై ఇరు దేశాధినేతలు చర్చలు జరిపారు. భారత్, దక్షిణ కొరియా మధ్య సంబంధాలకు ప్రజాస్వామ్య విలువలే పునాదని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. 2030 నాటికి 50 బిలియన్ డాలర్లకు పెంచే దిశగా నిర్ణయాలు తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రజాస్వామ్య విలువలు, చట్టబద్ధమైన పాలన అనేవి ఇరు దేశాల డీఎన్ఏలోనే ఉన్నాయని పేర్కొన్నారు. ఇరు దేశాల చర్చల అనంతరం మీడియా సమావేశంలో మట్లాడిన ప్రధాని, భారత్-దక్షిణ కొరియా మైత్రి ప్రపంచానికి శాంతి, స్థిరత్వ సందేశాన్ని ఇస్తుందని మోదీ అన్నారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, సమగ్ర వృద్ధి కోసం ఇరు దేశాలు ఒకే విధమైన దృక్పథాన్ని కలిగి ఉన్నాయని చెప్పారు. గత దశాబ్ద కాలంలో ఇరు దేశాల బంధం మరింత క్రియాశీలకంగా మారిందని వివరించారు. ప్రతి రంగంలోనూ కొత్త అవకాశాలను అందిపుచ్చుకుంటూ రెండు దేశాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతాయని మోదీ స్పష్టం చేశారు. "భారత్-కొరియా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 27 బిలియన్ డాలర్లకు చేరుకుంది. 2030 నాటికి 50 బిలియన్ డాలర్లకు పెంచే దిశగా ఈరోజు మేము పలు కీలక నిర్ణయాలు తీసుకున్నాం. రెండు దేశాల మధ్య ఆర్థికపరమైన లావాదేవీలను సులభతరం చేసేందుకు భారత్-కొరియా ఫైనాన్షియల్ ఫోరమ్‌ను ప్రారంభించాం. వ్యాపార సహకారాన్ని బలోపేతం చేసేందుకు ఒక పారిశ్రామిక సహకార కమిటీని ఏర్పాటు చేశాం. కీలకమైన సాంకేతికత, సరఫరా గొలుసుల్లో సహకారాన్ని పెంపొందించుకునేందుకు ఆర్థిక భద్రతా చర్చలకు శ్రీకారం చుడుతున్నాం. కొరియన్ కంపెనీలు, ముఖ్యంగా చిన్న, మధ్యతరహా పరిశ్రమలు భారత్‌లో ప్రవేశించడాన్ని సులభతరం చేయడానికి కొరియన్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌లను ఏర్పాటు చేస్తాం. వచ్చే ఏడాది కాలంలో భారత్-కొరియా వాణిజ్య ఒప్పందాన్ని అప్‌గ్రేడ్ చేస్తాం."

--నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి

ఇరు దేశాల మధ్య ఆర్థిక సంబంధాలను బలోపేతం చేసే లక్ష్యంతో ప్రస్తుతం అమల్లో ఉన్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని పునరుద్ధరించే అంశంపై భారత్- కొరియా చర్చలు జరిపినట్లు వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూశ్ గోయల్ తెలిపారు. కొరియా వాణిజ్య మంత్రి యో హాన్-కూతో జరిగిన సమావేశంలో ఈ ఒప్పందంపై చర్చించినట్లు వివరించారు. "భారత్-కొరియా జజ్బూరా (సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం) ఉన్నతీకరణ చర్చలను తిరిగి ప్రారంభం, పునరుద్ధరించే మార్గాలపై మాట్లాడం. అలాగే పారిశ్రామిక సహకారం, హరిత ఇంధనం, డిజిటల్ వాణిజ్య రంగాల్లో మరింత లోతైన సహకారానికి గల అవకాశాలపై చర్చించాం" అని గోయల్ సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొన్నారు.

2010 జనవరిలో అమల్లోకి వచ్చిన జజ్బూరా ఒప్పందంపై ఇరు దేశాలు దృష్టి సారించాయి. ఇప్పటివరకు దీనికి సంబంధించి 10కి పైగా సమీక్షా సమావేశాలు జరిగాయి. ఉక్కు, బియ్యం, రొయ్యల వంటి కొన్ని ఉత్పత్తుల ఎగుమతులను పెంచే ఉద్దేశంతో దక్షిణ కొరియా మార్కెట్‌లో ఈ ఉత్పత్తుల విస్తరణకు అవకాశం ఇవ్వాలని భారత్ గతంలో కోరింది. కొరియా సంస్థలు భారతీయ ఉక్కును కొనుగోలు చేయకపోవడం వంటి సమస్యలను కూడా భారత్ ప్రస్తావించింది.

# కాంగ్రెస్ దోపిడీతో ఏ ఒక్కరూ సంతృప్తిగా లేరు

**మొదటి పేజీ తరువాయి...**

ప్రణాళికలు రూపొందించి అభివృద్ధి చేశాం. కానీ కేసీఆర్‌కు పాలన చేతకావడం లేదు... మాకు పాలనలో అనుభవం ఉంది. ఆరు చందమామలు, ఏడు సూర్యులను పెడతామని అధికారంలోకి వచ్చి ఆర్థిక పరిస్థితిని దిగజార్చారు. అందువల్ల ప్రజలు సంఘటితమై తెలంగాణ పునర్నిర్మాణ యజ్ఞం మొదలు పెట్టాలి. గ్రహచారం బాగాలేదని కూర్చుంటే దెబ్బతింటాం. తెలంగాణ ప్రజలు గెలిచి నిలవాల్సిందే. జగిత్యాల జైత్రయాత్రతో రాజకీయ శక్తులను పునరేకీకరణ చేస్తూ పునర్నిర్మాణ యజ్ఞం ప్రారంభిస్తున్నా.. ముందుకెళ్లి విజయం సాధిద్దాం' అని కేసీఆర్ పేర్కొన్నారు.

'ఉత్తి మాటలు.. గప్పాలు కొట్టుడు కాదు.. మిషన్ భగీరథ ఐదేండ్లలో పూర్తి చేసి నీళ్లు ఇవ్వకపోతే ఓట్లు అడగం అని నిండు అసెంబ్లీలో చెప్పిన సీఎంను ఎవరైనా చూశారా? మరిప్పుడు ఏం రోగం వచ్చింది. పని చేయని వారిని లాగులు పగిలేదాకా సంపాలి. పొదరిల్లు లాంటి తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తిని ఏడు వేల మెగావాట్ల నుంచి 20వేల మెగావాట్లకు పెంచి క్షణం కూడా కరెంటు పోకుండా చేశాం. మరిప్పుడు ఏం బీమారి వచ్చింది. రైతుబంధు కోసం కూడా ఎదురుచూడాల్సిన పరిస్థితి. జగిత్యాలలో సభ పెడితే రైతుబంధు రెండో కిస్తీ ఇస్తున్నారు. మూడో కిస్తీ కోసం కేసీఆర్ మరో సభ పెట్టాలా. రైతుబంధు వేసేందుకు కాటారంలో సభ పెట్టారు. రెండు నెలలకోమారు ఎకరానికి ఆరు వేలు వేసి సిపాయిల్లా డప్పు కొట్టుకుంటున్నరు' అని కేసీఆర్ అన్నారు.

**.అందుకే బయటకు రాలేదు**

'బీఆర్ఎస్ పాలనలో తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేస్తే ఇప్పుడు మొక్కజొన్న కొనుగోలు చేస్తారో లేదో కూడా చెప్పడం లేదు. ఉద్యోగులకు 72శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ఇస్తే ఈ ప్రభుత్వం రిటైర్డ ఉద్యోగుల బకాయిలతోపాటు కనీసం ఏడు శాతం జీతం కూడా పెంచలేదు. ఉచిత బస్సుతో ఆటో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. పేపర్ తిరగేస్తే సింగరేణి, పౌరసరఫరాలు సహా అనేక కుంభకోణాలు, భూ కబ్జాలు జరుగుతున్న తీరు చూస్తే బాధ కలుగుతోంది. కూల్చివేతలు, కాల్చివేతలు, పోలీసుల దాడులు, అరెస్టుల చుట్టూ రాజకీయం తిరుగుతోంది. బీఆర్ఎస్ అధికారంలోకి రాకున్నా నేను ఒకటి రెండుమార్లు తప్ప బయటకు రాలేదు. ప్రజలు వాళ్లకు అధికారం ఇచ్చారు. మంచి జరగాలని కోరుకున్నా.. కానీ ఎక్కడ చూసినా చిల్లర మాటలు తప్ప ఒక్క నిర్మాణాత్మక కార్యక్రమం, గొప్ప స్కీమ్ లేదు. అందుకే జీవన్‌రెడ్డి లాంటి నాయకుడు "కాంగ్రెస్ పోవాలే.. బీఆర్ఎస్ రావాలే అంటున్నడు"' అని కేసీఆర్ పేర్కొన్నారు.

**మొదటి సంతకంతోనే హైడ్రా రద్దు**

'మేము మూడున్నర లక్షల మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తే హైడ్రాతో పిల్లలు పుస్తకాలు కూడా తీసుకునే సమయం ఇవ్వకుండా ఇండ్ల కూల్చివేతలు చేస్తున్నరు. హైడ్రాను జిల్లాల్లో కూడా తెస్తామని పీసీసీ అధ్యక్షుడు చెప్తున్నాడు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే మొదటి సంతకంతోనే హైడ్రాను రద్దు చేసి ఎత్తి చెరువులో పడేస్తం' అని కేసీఆర్ మండిపడ్డారు.

**జీవన్‌రెడ్డి.. నేను దగ్గరి మిత్రులం**

'జీవన్‌రెడ్డి గురించి ఎక్కువ చెప్తే మాది మేము డబ్బా కొట్టుకున్నట్లు అయితది. 45 ఏండ్ల నుంచి దగ్గరి మిత్రులం అయినా భిన్న రాజకీయ సిద్ధాంతాల కారణంగా విడివిడిగా పనిచేశాం. కానీ మంచి చెడ్డలు, కష్టసుఖాలు, అభిప్రాయాలు కలిసి పంచుకునే వాళ్లం. జగిత్యాల ప్రాంతం గురించి ప్రాణం పెట్టి పనిచేసిన నాయకుడు జీవన్‌రెడ్డి. నేను సీఎం అయిన తరువాత కరీంనగర్‌లో సభ పెడితే అక్కడికి వచ్చి బోర్నపల్లి బ్రిడ్జి అవసరం అని ప్రతిపక్ష ఎమ్మెల్యేగా అడిగారు. వెంటనే రూ. 80 కోట్లు మంజూరు చేసి బ్రిడ్జి కట్టించిన. ఇటీవల కొన్ని సర్వేలు జరిగితే బీఆర్ఎస్‌లో జీవన్‌రెడ్డి చేరిక ఆటంబాంబుగా పేలడంతోపాటు జగిత్యాలతోపాటు పొరుగు నియోజకవర్గాల్లో ఆయన ప్రభావం ఉంటుందని తేలింది. నేనూ, జీవన్‌రెడ్డి అన్నదమ్ముల్లా, పిల్లర్లుగా పనిచేస్తాం. ఆయన జగిత్యాల, పాత కరీంనగర్ జిల్లాలకే పరిమితం కాకుండా నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల బాధ్యతలన్నీ చూసుకోవాలి. అందుకే పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఈ నిమిషం నుంచే అపాయింట్ చేస్తున్నా. ఆరు నూరైనా.. వచ్చేసారి బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుంది. ఇది నామాట. జగిత్యాల యుద్ధం కార్యకర్తల వంతు. తెలంగాణ యుద్ధం మా వంతు' అని కేసీఆర్ ప్రకటించారు.

**అలిశెట్టి కవితతో ప్రారంభం**

జగిత్యాలకు చెందిన కవి అలిశెట్టి ప్రభాకర్ కవితతో కేసీఆర్ తన ప్రసంగం ప్రారంభించారు. 'చీకట్లో దడుసుకుంటే.. ఒక చెట్టే నీ చుట్టూరా అరణ్యమై బయపెడుతది.. గుండెంటూ ఉంటే ... అదే నీకు సైన్యం అయి నిలుస్తది' అన్నారు. ఈ సభకు వచ్చిన మీరు, రోడ్ల మీద అశేషంగా నిలిచిన జీవన్‌రెడ్డి అభిమానుల ఆశీర్వాదంతో నాకు గుండె ధైర్యం వచ్చింది. జీవన్‌రెడ్డి అన్నకు, ఆయన వెంట వచ్చిన వారికి బీఆర్ఎస్ అధ్యక్షుడిగా స్వాగతం' అంటూ కేసీఆర్ ప్రసంగం ప్రారంభించారు.

'బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే మొదటి సంతకంతోనే హైడ్రాను రద్దు చేసి ఎత్తి చెరువులో పడేస్తం. మూసీ ప్రాజెక్టుతో వెనుక రియల్ ఎస్టేట్ దందా ఉంది.

# రాజస్థాన్ హెచ్‌పీసీఎల్ రిఫైనరీలో అగ్నిప్రమాదం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 20 (ప్రభాత ఉదయం)**


రాజస్థాన్‌లోని బలోత్రా జిల్లా పచ్‌పద్రాలో ఉన్న హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) రిఫైనరీలో సోమవారం అగ్నిప్రమాదం సంభవించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు (ఏప్రిల్ 21) మంగళవారం ఈ రిఫైనరీని ప్రారంభించాల్సి ఉండగా, ఒక్కరోజు ముందే ఈ ఘటన జరగడం తీవ్ర కలకలం రేపింది. దేశంలోనే తొలి గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ రిఫైనరీ కమ్ పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌గా దీనిని నిర్మించారు. హెచ్‌పీసీఎల్, రాజస్థాన్ ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో సుమారు రూ.79,459 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ ప్రాజెక్టును చేపట్టారు. అగ్నిప్రమాదం సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, అత్యవసర బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం గానీ, గాయాలు గానీ అయినట్లు ఇప్పటివరకు అధికారికంగా ఎటువంటి సమాచారం లేదు. రేపు జరగనున్న ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరై, జాతికి అంకితం చేయాల్సి ఉంది. ఈ సందర్భంగా ఆయన ఎల్పీజీ ట్యాంకర్లను జెండా ఊపి ప్రారంభించి, బహిరంగ సభలో ప్రసంగిస్తారని షెడ్యూల్ లో పేర్కొన్నారు. కార్యక్రమం కోసం సుమారు 5,000 మంది పోలీసు సిబ్బందితో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ ఘటన నేపథ్యంలో ప్రధాని మోదీ పర్యటన, రిఫైనరీ ప్రారంభోత్సవ కార్యక్రమం యథాతథంగా జరుగుతుందా లేదా అనే దానిపై అనిశ్చితి నెలకొంది. దీనిపై అధికారులు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం అగ్నిప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

# వారంతపు సంతలో సిబ్బంది చేతి వాటం

## అడ్డగోలుగా మార్కెట్ రుసుము వసూళ్లు

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 20, (ప్రభాత ఉదయం)**

గద్వాలలో ప్రతి సోమవారం నిర్వహించు వారంతపు పశువుల సంతలో మార్కెట్ సిబ్బంది చేతివాటం పరాకాష్టకు చేరింది. పారదర్శకత కోసం ప్రభుత్వం ఆన్‌లైన్ ట్యాబ్ మిషన్లు అందజేసినా, క్షేత్రస్థాయిలో సిబ్బంది మాత్రం వాటిని అటకెక్కించారు. ప్రభుత్వం నిర్ణయించిన రుసుము కంటే అడ్డగోలుగా వసూలు చేస్తూ సామాన్య ప్రజల కష్టార్జితాన్ని దోచుకుంటున్నారు. కొన్ని దశాబ్దాలుగా గద్వాల్ వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పశువుల సంతలో పెద్ద ఎత్తు[illegible]న మేకలు, గొర్రెలు,ఎద్దులు, ఆవులు క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. వివాహాది శు భకార్యాలకు మేకలు, గొర్రెలు, గొర్రె పొట్టేళ్లను సంతలో చౌకధరలకు పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తారు. గ్రామాలల్లో మాంసం విక్రయించేవారు పెద్ద సంఖ్యలో మేకలు, గొర్రెలను కొనుగోలు చేస్తారు. గద్వాల జిల్లాతో పాటు ఆత్మకూరు, మక్తల్,రాయచూరు, పెబ్బేర్ తదిత ప్రాంతాల నుండి మేకలు, గొర్రెలు, బర్రెలు, ఎద్దులను తీసుకువచ్చి క్రయ విక్రయాలు చేస్తుంటారు. అత్యధికంగా గొర్రెలు, మేకలు క్రయ విక్రయాలు జరుగుతుంటాయి. గతంలో పసువుల సంత ద్వారా మార్కెట్ కు 20,000 రూపాయల వరకు ఆదాయం





వస్తుందని అంచనా. మార్కెట్ యార్డు ఆదాయం పెంచుకోవడానికి పాలకులు ఆన్ లైన్ మిషన్ ద్వారా కొనుగోలుదారులకు రిషిప్టులు అందజేసి మార్కెట్ రుసుము కిందా డబ్బులు వసూళ్లు చేస్తోంది. కాని ప్రభుత్వ నిబంధనల ప్రకారం నూటికి ఒక్క రూపాయి చొప్పున కొనుగోలు చేసిన ఆవు, మేక, ఎద్దు, గేదెలకు వసూలు చేయాలి. అనగా ఐదువేలకు మేకను కొనుగోలు చేస్తే 50 రూపాయలు మార్కెట్ రుసుము ఆన్ లైన్ నమోదు చేసుకొని రిషిప్ట పొందాల్సి ఉంటుంది. ఇలా మేకలను, గొర్రెలను కొనుగోలుదారులకు వ్యవసాయ మార్కెట్ సిబ్బంది ఆన్ లైన్ రిషిప్ట అందజేసి వారి నుంచి నగదు తీసుకోవలసి ఉంటుంది. కాని నిబంధనలకు విరుద్ధంగా పశువుల సంతలో పని చేసే సిబ్బంది కొనుగోలుదారులను నుంచి అందినకాడికి దోచుకుంటున్నారు. ప్రతి మేక, గొర్రెలను కొనుగోలు చేసిన వారి నుంచి రూ.100 -150 వసూళ్లు చేస్తున్నారు. వ్యవసాయ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో క్రయ, విక్రయదారుల నుంచి చలాన్ డబ్బులు వసూళ్లు చేస్తున్నారని, ఎలాంటి రసీదు ఇవ్వడం లేదు అని పలువురు ఆరోపించారు. రసీదు అడిగితేనే ఇస్తున్నారని లేకపోతే ఇవ్వడం లేదు అని క్రయ, విక్రయదారులు వాపోయారు. సిబ్బంది ఇష్టానుశారంగా దోచుకుని తమ జేబులు నింపుకుంటున్నారని కొనుగోలుదారులు ఆరోపిస్తున్నారు. సంతలో ఎంత వసూలు చేస్తున్నారు? నిబంధనలకు లోబడి వసూలు చేస్తున్నారా లేదా పర్యవేక్షించాల్సిన అధికారులు తమ బాధ్యత మరచి తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ తతంగం చూస్తుంటే మార్కెట్ యార్డుకు రావలసిన ఆదాయాన్ని సిబ్బంది కాజేస్తున్నట్లు అనుమానాలు బలంగా వినిపిస్తాయి. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. దీనిపై గద్వాల మార్కెట్ యార్డు సెక్రటరీ వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.



# 'కేసీఆర్ కాస్కో..

**మొదటి పేజీ తరువాయి...**

మేడిగడ్డ బరాజ్ పరిశీలన తర్వాత కాటారం మండలం నస్తూరిపల్లిలో మంత్రి శ్రీధర్‌బాబు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో సీఎం పాల్గొన్నారు. రెండో విడత రైతుభరోసా రూ.5,700 కోట్లు ఆన్‌లైన్‌లో విడుదల అనంతరం మాట్లాడారు. జై కాంగ్రెస్ అంటూ ప్రసంగాన్ని మొదలెట్టిన ఆయన 'తోడేలు బయటకు వెళ్లింది. ఈ సభ చూసి వారి గుండెలు అదరాలి..'అంటూ మాజీమంత్రి జీవన్‌రెడ్డి, జగిత్యాలలో కేసీఆర్ సభను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు.

**ఎవరి పాలన కావాలో ప్రజలు ఆలోచించాలి**

'రైతు ఆత్మగౌరవం కోసం, ప్రజా సంక్షేమం కోసం పథకాలు అమలు చేసిన కాంగ్రెస్ ప్రజాపాలన కావాలో.. రాష్ట్రాన్ని విధ్వంసం చేసిన పాపాల భైరవుడు కేసీఆర్ పాలన కావాలో పార్టీ మారిన ఆ పెద్దమనిషితో పాటు తెలంగాణ ప్రజలు ఆలోచన చేయాలి. ఈ దేశానికి వెన్నెముకైన రైతును ఆదుకోవాలనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం ముందుకు పోతోంది. రైతు సంక్షేమం అనేది కాంగ్రెస్ నినాదం కాదు విధానం. ఆ దిశలోనే ఆనాడు శాశ్వత ప్రాతిపదికన నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్, శ్రీశైలం వంటి ప్రాజెక్టులను కట్టి సాగునీరు అందించడం చరిత్ర పుటల్లో లిఖితమయ్యింది.

**నాడు వ్యవసాయం దండగ అన్న ప్రభుత్వాలకు చరమగీతం**

ఆత్మహత్యల వైపు పయనిస్తుంటే వారి ఆత్మగౌరవం నిలబెట్టాలని గిట్టుబాటు ధర కల్పన చట్టం తీసుకరావడమేగాక పంటల అధిక ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం అగ్రభాగాన నిలిచేలా కాంగ్రెస్ ప్రభుత్వాలు దోహదపడ్డాయి. వ్యవసాయం దండగ అని కరెంటు ఇవ్వని ప్రభుత్వాలకు చరమగీతం పాడుతూ వైఎస్సార్ పాదయాత్ర చేసి దేశంలోనే మొదటిసారి చేవెళ్ల వేదికగా ఉచిత కరెంటు అమలు చేసి రైతుకు బాసటగా నిలిచారు. రైతులు అప్పులు తీర్చలేక ఆత్మహత్యల వైపు పయనిస్తున్నారని నాటి పీఎం మన్మోహన్‌సింగ్ 72 వేల కోట్ల రైతులకు రుణమాఫీ చేసి వారిని రుణ విముక్తుల్ని చేసిన ఘనత చరిత్రలో నిలిచింది.

**దండగ కాదు పండగ అని నిరూపిస్తున్నాం..**

తెలంగాణలో ప్రజాపాలన ఏర్పాటు కోసం రాష్ట్రంలో ఇరువైపులా నేను, సమ్మక్క సారలమ్మ సాక్షిగా బాసర టు భద్రాది వరకు భట్టి విక్రమార్క పాదయాత్ర చేసి ఇచ్చిన మాట మేరకు రూ.2 లక్షల రుణమాఫీని దశల వారీగా నేరవేరుస్తున్నా ప్రతిపక్షాలు ఉనికి కోసం రాద్ధాంతం చేస్తున్నాయి. నాడు తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేశాం. 25.35 లక్షల మంది రైతులకు రుణ విముక్తి కలిగించాం. నేడు రైతు భరోసా కింద రూ.5,300 కోట్లు ఖాతాల్లో వేస్తున్నాం. వ్యవసాయం దండగ కాదు పండుగ అని నిరూపించుకునే దిశలో సాగునీటి ప్రాజెక్టుల పునర్నిర్మిస్తున్నాం. 3.15 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తున్నాం. ఇలాంటి తరుణంలో ప్రజాపాలన పోవాలో.. పాపాల భైరవుడు కేసీఆర్ పాలన కావాలో పార్టీ మారుతున్న పెద్దమనిషి ఆత్మవిమర్శ చేసుకోవాలి..'అని సీఎం అన్నారు.

**జీవన్‌రెడ్డి అర్హత ఏంటో తేలింది..**

ఫామ్‌హౌస్‌లో పడుకున్న పెద్దాయనకు పాలన మళ్లీ ఎందుకని ప్రశ్నించకుండా, కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవం కోసం రక్తమోడ్చి జెండాలు మోసిన కార్యకర్తలు, నాయకుల శ్రేయస్సు విస్మరించి ప్రజాపాలన వచ్చే ముందు జగిత్యాలో ఓడిన జీవన్‌రెడ్డి అర్హత ఏంటో తేలింది. ఇక ఆ పెద్దమనిషి పుట్టు పూర్వోత్తరాలు చెప్పక తప్పదు. 1983లో తుమ్మల నాగేశ్వర్‌రావు సాక్షిగా ఎన్టీఆర్ ఎమ్మెల్యేగా టికెట్టు ఇచ్చి గెలిపించడమే గాక ఎక్సైజ్ మంత్రి పదవి ఇస్తే ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి నాదెండ్లతో జట్టు కట్టినా దిక్కులేక కాంగ్రెస్‌లో చేరడం నిజం కాదా? కాంగ్రెస్‌లో 14 సార్లు ఎమ్మెల్యే బీఫామ్ ఇస్తే, ఓడినా గెలిచినా మద్దతు పలికితే సంయమనం పాటించకపోవడం అప్రజాస్వామికం కాదా? జగిత్యాల ప్రజలు నీకు ఊడిగం చేసింది వాస్తవం కాదా? ఈ వయస్సులో రాజకీయ నీతి విస్మరించి శత్రువు చేతిలోచేరి ప్రజాపాలన పోవాలి...పాపాల భైరవుడు కేసీఆర్ పాలన రావాలనడం సిగ్గు చేటు..'అంటూ సీఎం ధ్వజమెత్తారు.

**కుట్ర రాజకీయాలకు తావు లేదు..**

'గతంలో వైఎస్సార్, డీఎస్ కాంబినేషన్ మాదిరి నేను, మహేశ్‌కుమార్‌గౌడ్ కలిసి పార్టీని అధికారంలోకి తెస్తాం. దళిత బిడ్డలు, బీసీలు, ఆదివాసీలను మంత్రులు చేసిన ప్రజాపాలన పోవాలనే కుట్ర రాజకీయాలకు తెలంగాణలో తావులేదు. వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ రాజ్యమే తప్ప మరొకటి రాదు. చరిత్ర పునరావృతం చేసేలా హైదరాబాద్‌ను మహానగరం చేస్తూ, పాలమూరు వంటి ప్రాజెక్టులకు పూర్తి చేస్తూ ఎవరు అడ్డొచ్చినా తొక్కుతూ ముందుకు పోతాం..'అని రేవంత్ అన్నారు. దేశంలో అత్యధిక మెజారిటీతో రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే గాక రాహుల్‌ను ప్రధాని చేద్దామని పిలుపునిచ్చారు. రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్‌రావు, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, ఎంపీలు వంశీకృష్ణ, వేం నరేందర్‌రెడ్డి, బలరాంనాయక్, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జపాన్‌లో భారీ భూకంపం.. సునామీ హెచ్చరికలు జారీ

**మొదటి పేజీ తరువాయి...**

ప్రకారం సాయంత్రం 4.54 గంటలకు ఉత్తర జపాన్‌లో సన్రికు ప్రాంతంలో భూంకంపం సంభవించింది. సముద్రమట్టం నుంచి 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు గుర్తించారు. జపాన్‌లోని ఉత్తర తోహోకు ప్రాంతంలో ఉన్న ఒక ప్రధాన పారిశ్రామిక, వాణిజ్య రేవు 'హచినోహే పోర్ట్' నుంచి నౌకలు వెంటనే తరలిపోవాలని అత్యవసర హెచ్చరికలు జారీ అయ్యాయి. అధికారులు తీర ప్రాంతాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. అలలు త్వరలో తీరానికి చేరే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. టోక్యో నుంచి ఆఓమోరి వరకు బుల్లెట్ రైలు సేవలను భూకంపం తర్వాత నిలిపివేసినట్లుగా తెలిపారు. జపాన్‌లో భూకంపం కారణంగా జారీ చేసిన సునామీ హెచ్చరికల ప్రభావం మన దేశంపై ఉండబోదని ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ (×చీజూ×ూ) వెల్లడించింది. సునామీ ఏర్పడిన కేంద్రం నుంచి 300 కిలోమీటర్ల వరకే దాని ప్రభావం ఉంటుందని తెలిపింది. ఏదైన అనుకోని మార్పులు సంభవించే అవకాశం ఉంటే ముందస్తు హెచ్చరికలు విడుదల చేస్తామని పేర్కొంది.

# శ్రీ వైష్ణవి జూనియర్ కళాశాల టాపర్స్‌కు సన్మానం

రాజేంద్రనగర్, ఏప్రిల్ 20 (ప్రభాత ఉదయం)

శ్రీ వైష్ణవి జూనియర్ కాలేజ్ ఇటీవలి ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన కళాశాల విద్యార్థులను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఘనంగా సన్మానించారు. సోమవారం ఎమ్మెల్యే నివాసం లో కళాశాల టాపర్లను ప్రకాశ్ గౌడ్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీజ విభాగంలో 996, 992, 991 మార్కులు, బైపీసీ విభాగంలో 995, 990 మార్కులు సాధించిన విద్యార్థులను ప్రశంసించి శాలువాలు, జ్ఞాపికలు అందజేశారు. విద్యార్థుల కృషి, పట్టుదలపై ఎమ్మెల్యే గారు అభినందనలు తెలియజేసి, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయిలను చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ ఎం. శ్రీనివాస్ గౌడ్, డైరెక్టర్ సి. శ్రీనివాసాచారి పాల్గొని విద్యార్థుల విజయానికి సహకరించిన అధ్యాపక బృందాన్ని అభినందించారు.



భవానీ కాలనీ శ్రీ వైష్ణవి జూనియర్ కళాశాల విద్యార్థులను అభినందిస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్



# కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదలకు వరం

## ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్

గండిపేట,ఏప్రిల్20(ప్రభాత ఉదయం)

పేదలకు కల్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాలు వరమని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అన్నారు.గండిపేట మండలం కల్యాణలక్ష్మి,శాదీ ముబారక్ పథకాల కింద చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన 104మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.అనంతరం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ..పేద ప్రజలు ఇలాంటి సంక్షేమ పథకాలను సద్వినియోగించుకోవాలన్నారు.ప్రభుత్వం పేద ప్రజల కోసం ఈ కార్యక్రమాన్ని అమలు చేయడం జరుగుతుందన్నారు.ఇలాంటి కార్యక్రమాల ద్వారా ఎంతో మంది యువతుల వివాహానికి ఆర్థిక ఆదుకోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ప్రభుత్వాలు ప్రజల సంక్షేమం కోసం కేటాయించిన నిధులు నేరుగా లబ్ధిదారులకు అందేది కాదన్నారు.ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా అర్హులైనా ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని తెలిపారు.ఆడపిల్లల వివాహాలు నిరుపేద తల్లిదండ్రులకు భారం కాకూడదనే ఇంతటి బృహత్తర పథకాలకు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. ఈ పథకాలు వచ్చాక ఆడపిల్లల తల్లిదండ్రులు పెద్దగా ఆర్థిక ఇబ్బందులు పడకుండా తమ కుమార్తెల వివాహాలను వైభవంగా జరిపించుకుంటున్నారని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకాలు పేద,మైనారిటీ కుటుంబాలకు ఎంతో ఉపయుక్తంగా ఉందన్నారు.వారి వివాహ ఖర్చుల భారం తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానికులు తదితరులు పాల్గొన్నారు



బుద్వేల్‌లో జరిగిన హిందూ సమ్మేళనం లో పాల్గొన్న వేద పండితులు, స్థానిక నాయకులు

# బుద్వేల్ బస్తీలో హిందూ సమ్మేళనం

## పెద్ద ఎత్తున తరలివచ్చిన హిందూ బంధువులు

బుద్వేల్, ఏప్రిల్ 20 (ప్రభాత ఉదయం) :

రాజేంద్రనగర్ నియోజకవర్గం బుద్వేల్ బస్తీలో ఆదివారం రాత్రి హిందూ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హిందూ బంధువులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. మాణికేశ మహాప్రస్థానం ధర్మార్చెడ్ కు చెందిన శంకర్ స్వామీజీ, తెలంగాణ సాదు పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు, రేవల్లి రాజుశర్మ, చండీ ఉపాసకులు ముఖ్య వక్త డా. వేద ప్రకాశ్, మహిళ వక్త ప్రసన్న లక్ష్మీ లు కార్యక్రమానికి హాజరయ్యారు. స్థానిక శివాలయంలో దర్శనం చేసుకుని, ప్రత్యేక పూజలు చేసే తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని ప్రారంభించారు. హిందూ బంధువులను జాగృతం చేసేందుకు ప్రసంగించారు. జై శ్రీరామ్ నినాదాలతో మారుమోగిన ఈ సమ్మేళనం హిందూ ఐక్యతను చాటిచెప్పింది.



# ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

## ప్రాజెక్ట్ అధికారిని స్వాతి.. ప్రజపాలనతో అభివృద్ధి

రాజేంద్రనగర్,ఏప్రిల్20(ప్రభాత ఉదయం)

ప్రజాపాలన కార్యక్రమంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని రాజేంద్రనగర్ సర్కిల్ ప్రాజెక్టు అధికారిని స్వాతి తెలిపారు.99 రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమంలో భాగంగా "ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక" కింద యూసీడీ కార్యకలాపాలు,ప్రభుత్వ పథకాలపై అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమం కిస్మత్‌పూర్ అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించారు.ఈ సమావేశానికి వివిధ కార్పొరేషన్ల నుండి మైనారిటీ,ఎస్సీ,ఎస్టీ,బీసీ కార్పొరేషన్ల సిబ్బంది హాజరై తమ తమ విభాగాల్లో అమలవుతున్న పథకాలపై సంక్షిప్తంగా వివరించారు.ఈ సమావేశంలో ఇందిరా మహిళా శక్తి పథకం,ఉచిత బస్సు పథకం,గృహలక్ష్మీ పథకం,గృహజ్యోతి పథకం,ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు.ఈ పథకాల ప్రయోజనాలను ప్రజలకు చేరవేసి వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో యూసీడీ సిబ్బంది,అంగన్వాడీ వర్కర్లు,ఆశావర్కర్లు,స్థానిక మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.




# కార్మికుడిపై బ్లేడ్‌తో మరో కార్మికుడు దాడి

## తీవ్ర గాయాలకు గురైన కార్మికుడు

రాజేంద్రనగర్, 20 (ప్రభాత ఉదయం) :



ఫర్నిచర్ షాప్ లో పనిచేస్తున్న కార్మికుడిపై మరో కార్మికుడు బ్లేడుతో దాడి చేసి గాయపరిచిన సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం...అత్తాపూర్ నానాకి మసీద్ సమీపంలో మహమ్మద్ ఇమ్రాన్ మెట్రో ఫర్నిచర్ షాపు నిర్వహిస్తున్నాడు. షాపు లో జిర్రా కు చెందిన సయ్యద్ మజర్ పని చేస్తున్నాడు.ఈమధ్య పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో షాపు యజమాని మజార్ ను పనిలో నుంచి తొలగించాడు. మజర్ స్థానంలో అజీజ్ ను నియమించాడు. అజిజ్ ను పనిలో నుంచి వెళ్ళిపోవాల్సిందిగా పలుమార్లు మజార్ హెచ్చరించాడు. అప్పటినుంచి అజీజ్ పై కోపం పెంచుకున్న మజర్ ఆదివారం రాత్రి అజీజ్ పై బ్లేడుతో దాడికి పాల్పడ్డాడు. మజర్ దాడిలో అజిజ్ తీవ్రంగా గాయపడ్డాడు. దాడిని గుర్తించిన తోటి కార్మికుడు సోహెబ్ వెంటనే సహా కార్మికుడు మహమ్మద్ అహ్మద్ కు సమాచారం అందించాడు. అజిజ్ పై దాడి చేసిన దృశ్యాలు సీసీ కెమెరాలలో రికార్డు అయ్యాయి. తోటి కార్మికుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని ఆరాంఘర్ చౌరస్తాలో సోమవారం పట్టుకున్నారు. నిందితుడు నుంచి బ్లేడు, ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్ కు తరలించారు.



# నేడు హిమాయత్ సాగర్, కిస్మత్పూర్ విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజేంద్రనగర్(బండ్లగూడ), ఏప్రిల్ 20(ప్రభాత ఉదయం)

హిమాయత్‌సాగర్ సెక్షన్‌లో ఇంటర్‌లింకింగ్, ఫీడర్ బైఫర్కేషన్ పనుల నిమిత్తం 11 కేవీ ఫీడర్లపై మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ రమేష్ తెలిపారు.. ఉదయం 09:00 గంటల నుండి. ఉదయం 11:00 గంటల వరకు గంధమ్‌గూడ సబ్-స్టేషన్ నుండి వెలువడే 11 కేవీ రిచ్‌మండ్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన కీర్తి రిచ్‌మండ్ విల్లాస్, పిడటి కాలనీ ఎ, బి, సి, డి లోని కొంత భాగం, స్పెషల్ బ్లాక్స్, హైదర్షకోట్ విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన వెంకటేశ్వర కాలనీ, డైమండ్ వ్యాలీ, ప్రస్తాహ్ నగర్, తిరుమల గార్డెన్, రాధా రీట్పర్స్ ఫేజ్-××, పావని హార్మొనీ విల్లాస్, బచ్‌పన్ స్కూల్, పద్మశ్రీ హిల్స్ మెయిన్ రోడ్‌లోని కొంత భాగం, సన్ సిటీ విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన హిమాగిరినగర్, గంధమ్‌గూడ, వెస్ట్ ఎండ్ కాలనీ, శాంతి నగర్, లక్ష్మీ నగర్, హైదర్ షా కోట్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

**కిస్మత్ పూర్ లో...**

కిస్మత్ పూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం మంగళవారం విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ఏ మల్లేష్ రాజ్ తెలిపారు. సెక్షన్ పరిధిలో విద్యుత్ మరమ్మత్తుల నిర్వహణ, చెట్లు నరికే పనుల నిమిత్తం సాయంత్రం 4:30 నుండి 05:00 గంటల వరకు ధాత్రి ఎన్క్లేవ్ పరిధిలోని శ్రీనివాసం ఎన్క్లేవ్, ఓం నగర్, ధాత్రి ఎన్క్లేవ్, ఆనంద్ నగర్, శ్రీనివాసం ఎన్క్లేవ్, అశోక్ విహార్, సైబర్ శాంతి, పలాసియో విల్లాస్ మొదలైన ప్రభావిత ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు.

# పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు


## సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు

శేరిలింగంపల్లి ఏప్రిల్ 20, (ప్రభాత ఉదయం)



సైబరాబాద్ పోలీసు కమీషనర్ డాక్టర్ రమేష్

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ ఎస్.ఎస్.సి (తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ) పరీక్షల దృష్ట్యా కమిషనరేట్ పరిధిలోని అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ పరీక్షలు సజావుగా సాగేలా చూడటం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులు ఏప్రిల్ 20 నుండి ఏప్రిల్ 27 వరకు ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 వరకు అమల్లో ఉంటాయని తెలిపారు. ఐదుగురు అంతకంటే ఎక్కువ మంది చేరరాదు. పరీక్షా కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమిగూడటం నిషేధం. జిరాక్స్ సెంటర్ల మూసివేత పరీక్షా కేంద్రాలకు 100 మీటర్ల లోపు ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్లు ఇంటర్నెట్ సెంటర్లను పరీక్షా సమయంలో మూసి ఉంచాలి. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కమిషనర్ హెచ్చరించారు. విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు మిలిటరీ సిబ్బంది, హోం గార్డులు.విద్యాశాఖకు చెందిన ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులకు వర్తించవని తెలిపారు. పరీక్షలు పారదర్శకంగా ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కమిషనర్ కోరారు.



# ఉరి వేసుకొని గృహణి ఆత్మహత్య


రాజేంద్రనగర్,ఏప్రిల్ 20(ప్రభాత ఉదయం)

ఓ గృహణి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.ఎస్ఐ రాఘవేందర్ తెలిపిన వివరాల ప్రకారం బండ్లగూడ ఎన్ఎఫ్సి కాలనీకి చెందిన శివ,సుమలత (36)భార్యాభర్తలు.వీరికి 10 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది.వివాహం జరిగి పది సంవత్సరాలు అయిన సంతానం కలగలేదు.అనారోగ్య సమస్యలతో పాటు సంతానం కలగలేదని తరచూ సుమలత బాధపడేది.సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది.విషయం గమనించిన కుటుంబ సభ్యులు రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు పంచానామ నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సిద్ధిక్ నగర్‌లో ట్రాఫిక్ నరకయాతన

## డీసీపీకి విన్నవించిన ఆంజనేయులు సాగర్

**శేరిలింగంపల్లి : ఏప్రిల్ 20,(ప్రభాత ఉదయం)**




ట్రాఫిక్ డీసీపీకీ వినతి పత్రం అందిస్తున్న అంజయ్య నగర్ డివిజన్ నాయకులు..

అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని సిద్ధిక్ నగర్ కాలనీలో నిత్యం ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యలపై సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ రాజన్ రతన్ కుమార్ కు వినతిపత్రం సమర్పించారు. అంజయ్య నగర్ డివిజన్ సీనియర్ నాయకులు ఆంజనేయులు సాగర్ కాలనీ ప్రజలు, ఐటీ ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులను స్వయంగా డీసీపీ డీసీపీకి హనుమంత్ రావులకు వివరించారు. సిద్ధిక్ నగర్ అమ్మవారి టెంపుల్ సమీపంలో రోడ్డు చాలా ఇరుకుగా ఉండటం వల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఐటీ ఉద్యోగులు ఇతర ప్రయాణికులు ఈ ఇరుకు దారిలో ప్రతిరోజూ 20 నిమిషాలకు పైగా ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నారని వివరించారు. భారీ వాహనాలు కార్ల రద్దీ వల్ల అంబులెన్స్‌లు సైతం ముందుకు కదలలేని పరిస్థితి నెలకొందని, ఇది ప్రాణాపాయానికి దారితీసే ప్రమాదం ఉందని ఆంజనేయులు సాగర్ ఆందోళన వ్యక్తం చేశారు. పీక్ అవర్స్‌లో ఇక్కడ పరిస్థితి దారుణంగా ఉంటోందని ఉదయం, సాయంత్రం వేళల్లో కనీసం ఒక ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను నియమిస్తే తప్ప ఈ సమస్య పరిష్కారం కాదని చెప్పారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం ఉదయం 8 గంటల నుండి 11:30 వరకు సాయంత్రం 6:30 నుండి 9:30 వరకు ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను నియమించాలని డీసీపీని కోరారు. డీసీపీ సానుకూలంగా స్పందిస్తూ తక్షణమే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిద్ధిక్ నగర్ జనరల్ సెక్రటరీ రవీందర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ దిలీప్, నాయకులు రాము, పి. లక్ష్మయ్య సాగర్, మైత్రీ శేఖర్, రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# కొత్తకోట ప్రజల దాహార్తిని తీర్చాలి

## కలెక్టర్ వినతి పత్రం అందజేసిన బీజేపీ నాయకులు

**కొత్తకోట ఏప్రిల్ 20 (ప్రభాత ఉదయం)**

కొత్తకోట బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి కి సోమవారం వినతి పత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కొమ్ము భరత్ భూషణ్ మాట్లాడుతూ, కొత్తకోట పురపాలక సంఘానికి అమృత పథకం క్రింద 2023 లో ప్రజల మంచినీటి అవసరాల దృష్ట్యా మంజూరి అయినా 14.95 కోట్ల, నిధుల పనులను చేపట్టడంలో అధికారులు, నాయకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. వేసవికాలంలో ప్రజల మంచినీటి సౌకర్యాన్ని త్వరగా ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చాలంటూ కలెక్టర్ కు వినతి పత్రం ద్వారా కోరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, రాసమోని సాయిరాం, మద్దిగట్ల శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సత్యం సాగర్, గండు రవీందర్ గౌడ్, రాజారాం యాదవ్, గట్టు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



### ప్రజావాణి ఫిర్యాదులను

# పరిష్కరించాలి

## అదన కలెక్టర్ లక్ష్మీనారాయణ

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 20(ప్రభాత ఉదయం)**

ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు సంబంధిత శాఖల అధికారులు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ ఆదేశించారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా ఐడిఓసి సమావేశపు మందిరంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు తో కలిసి ఆయన ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఈ వారం వివిధ సమస్యలపై మొత్తం 83 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ముఖ్యమంత్రి ప్రజావాణిలో మన జిల్లాకు సంబంధించి మొత్తం 111 ఆర్జీలు పెండింగ్ లో ఉన్నాయని వాటిని కూడా వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 20(ప్రభాత ఉదయం)**

సంక్షేమ వసతి గృహాలను సంబంధిత సిబ్బంది శుభ్రంగా ఉంచుకుంటేనే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటారని అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల 20 నుంచి 26 వరకు సంక్షేమ వారోత్సవాల నేపథ్యంలో అదనపు కలెక్టర్ సోమవారం గద్వాలలోని బీసీ బాలికల సంక్షేమ వసతిగృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వసతిగృహంలోని వంటశాలను, స్నానపు గదులు, మరుగుదొడ్లను ఆయన పరిశీలించారు. వండిన ఆహార పదార్థాలను పరిశీలించి విద్యార్థులకు ఎప్పటికప్పుడు రుచికరమైన వంటలను వండించి పెట్టాలన్నారు. వసతి గృహ వాష్రూమ్స్ ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యం బాగుంటుందని పేర్కొన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ వారికి కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు. ప్రస్తుతం అక్కడ కల్పించిన సౌకర్యాల పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేస్తూ అధికారులను అభినందించారు. వసతిగృహ విద్యార్థులకు ఎలాంటి సమస్యలు రాకుండా ఇలాగే ఎల్లప్పుడూ సజావుగా నిర్వహించాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టరు వార్డెన్ కు, అక్కడి సిబ్బందికి సూచించారు. ఈ పర్యటనలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నుషిత , వసతి గృహ వార్డెన్ ప్రమీల, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు

# కూకట్‌పల్లిలో ఘనంగా ఏపీ సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు

## కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన కెపిహెచ్ బి డివిజన్ టిడిపి అధ్యక్షుడు సత్తార్

**కూకట్ పల్లి, ఏప్రిల్ 20 (ప్రభాత ఉదయం)**

కూకట్ పల్లి నియోజకవర్గంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సీఎం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. కెపిహెచ్బి డివిజన్ అధ్యక్షుడు సత్తార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి టిడిపి శ్రేణులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి పథంలో తీసుకొని వెళ్లిన గొప్ప విజన్ ఉన్న నేత చంద్రబాబు నాయుడు అని కొనియాడారు. అదేవిధంగా అమరావతిని సైతం ఇలానే ముందుకు తీసుకొని వెళ్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తూ ముందుకు సాగే దిశగా ఆయురారోగ్యాలతో ఉండాలని వారు కోరుకున్నారు. అనంతరం వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# నటి అనసూయపై అసభ్యకర కామెంట్స్: యువకుడి అరెస్ట్

**శేరిలింగంపల్లి : ఏప్రిల్ 20,(ప్రభాత ఉదయం)**



ప్రముఖ సినీ నటి యాంకర్ అనసూయ భరద్వాజ్‌పై సోషల్ మీడియా వేదికగా అసభ్యకరమైన గౌరవానికి భంగం కలిగించేలా పోస్టింగ్‌లు పెట్టిన ఓ వ్యక్తిని సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. గత ఏడాది డిసెంబర్ 23 నుండి పలువురు వ్యక్తులు, సోషల్ మీడియా పేజీల నిర్వాహకులు తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, అశ్లీల పదజాలంతో దూషిస్తూ తన ప్రతిష్టను దిగజారుస్తున్నారని అనసూయ భరద్వాజ్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై సమగ్ర విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడిని గుర్తించారు. నిందితుడు నల్గొండ జిల్లా, తిరుమలగిరి నాగార్జున సాగర్ మండలం, ఆల్వాల గ్రామానికి చెందిన దోరెపల్లి చంటి (30) గా గుర్తించారు. ఇతను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా బాధితురాలిని లక్ష్యంగా చేసుకుని అభ్యంతరకరమైన కంటెంట్‌ను సర్క్యులేట్ చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అనసూయ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని నిందితుడి అరెస్టు చేశారు. సోషల్ మీడియా వినియోగదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఎవరినైనా కించపరిచేలా లేదా అసభ్యకరంగా పోస్టులు పెడితే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని సైబరాబాద్ సైబర్ క్రైమ్స్ డిసిపి టి. సాయి మనోహర్ హెచ్చరించారు. ఎవరైనా సైబర్ వేధింపులకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు లేదా సమీపంలోని సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.



ఎలక్ట్రికల్ ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రతినిధులుగా ఎన్నికైన వారిని సన్మానిస్తున్న ఎస్ ఎల్ ఐ యాదయ్య

# టీజీ ఎస్పీడీసీఎల్ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా భార్గవ్

**కందుకూరు, ఏప్రిల్ 20(ప్రభాత ఉదయం)**

టీజీ ఎస్పీడీసీఎల్ తెలంగాణ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా భార్గవ్ ఎన్నికయ్యారు. కందుకూర్ డివిజన్ మామిడిపల్లి సబ్ డివిజన్ ఏడీఈ గా పనిచేస్తున్న భార్గవ్ ను కంపెనీ అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. కంపెనీ అధ్యక్షులుగా ఎన్నికైన భార్గవ్ ను ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు . ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ తావు నాయక్ , ఆర్గనైజింగ్ సెక్రటరీ ధన్ సింగ్ , రాములు , రాజేంద్రనగర్ సర్కిల్ రీజనల్ సెక్రటరీ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.




# ఎస్సీ బాలుర వసతి గృహాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతులు కల్పించాలి: ఎంపీ.ఓ సుదర్శన్

**కొత్తకోట ఏప్రిల్ 20 (ప్రభాత ఉదయం)**

కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఎంపీ.ఓ సుదర్శన్ సోమవారం ఆకస్మితంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపి.ఓ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక సంక్షేమ వారోత్సవాల సందర్భంగా ఈనెల 20వ తేదీ నుండి 26 తేదీ వరకు సంక్షేమ వసతి గృహాలలో ఏడు రోజుల పాటు ప్రణాళికను సంసిద్ధం చేయడం జరిగిందన్నారు. ఆ యొక్క ప్రణాళికను ప్రణాళికబద్ధంగా సంక్షేమ వారోత్సవాల ముఖ్య లక్ష్యమైన మౌలిక సదుపాయాల కల్పన నాణ్యమైన విద్య ను సూచిస్తూ, ప్రతి విద్యార్థికి విద్యా- ప్రతి కుటుంబానికి సంక్షేమం అనే నినాదంతో ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా సంకల్పించి రూపొందించిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గృహ సంక్షేమ అధికారి ఎస్ సంతోష్ కుమార్.సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




# ఘనంగా మహాత్మా శ్రీ బసవేశ్వర జయంతి వేడుకలు

## జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 20 (ప్రభాత ఉదయం)**

జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సోమవారం మహాత్మా శ్రీ బసవేశ్వర జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ తో కలిసి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరై, జ్యోతి ప్రజ్వలన గావించి, బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. మహాత్మా బసవేశ్వరుడు 12వ శతాబ్దంలో సమాజంలో ఉన్న కుల వ్యవస్థ, అసమానతలకు వ్యతిరేకంగా పోరాడి సమానత్వం, న్యాయం, ధర్మం వంటి విలువలను ప్రచారం చేసిన మహనీయుడు అని పేర్కొన్నారు. ఆయన ఆలోచనలు నేటి సమాజానికి మార్గదర్శకమని తెలిపారు. బసవేశ్వరుడి ఆశయాలను అనుసరించి సమాజంలో సౌభ్రాతృత్వం పెంపొందించేందుకు కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అనంతరం అధికారులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, కార్యదర్శులు, అధ్యక్షులు, తదితరులు ఆయన చిత్రపటానికి అంజలి ఘటించి, నివాళులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి ఎన్. ఎల్. నరసింహ రావు, ఏబీసీడీఓ రవీందర్, వీర శైవ లింగాయత్ సంఘం జిల్లా అధ్యక్షులు బి. సిద్దయ్య, వీర శైవ సంఘం మండల అధ్యక్షులు జిలకర కుమార స్వామి, అగ్రగామి పత్రిక ఎడిటర్ కన్నా పరశురాములు, కురుమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జాయ మల్లేశ్, దిశ మెంబెర్ బి. శ్రీనివాస్, కేజీకేఎస్ జిల్లా ఉపాధ్యక్షులు, బల్నే వెంకట మల్లయ్య, స్వర్ణకారుల సంఘం జిల్లా అధ్యక్షులు వలబోజు చక్రపాణి, పద్మశాలి సంఘం టౌన్ ప్రెసిడెంట్ వేముల బాలరాజు, టికేవిస్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ అభినాష్ నంద, ఎన్బిఎస్ జిల్లా కార్యదర్శి రఘుపతి నంద, చేనేత ఐక్య వేదిక జిల్లా కార్యదర్శి బిర్రు నర్సింహులు, వీర శైవ లింగాయత్ సంఘం సభ్యులు, గౌడ కమ్యూనిటీ సభ్యులు, ఇతర కుల సంఘాల నాయకులు, ఐడిఓసి సిబ్బంది, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# చందానగర్‌లో 'హిందూ సమ్మేళనం

## భక్తిభావంతో పులకించిన గౌతమీ నగర్!



హిందూ సమ్మేళనానికి హాజరైన భక్తులు.




అతిథులను సన్మానిస్తున్న కసిరెడ్డి భాస్కర్ రెడ్డి...

**శేరిలింగంపల్లి : ఏప్రిల్ 20, (ప్రభాత ఉదయం)**

హిందూ ధర్మ పరిరక్షణ ఐక్యత లక్ష్యంగా చందానగర్‌లోని శిల్పా ఎన్ క్లవ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన 'హిందూ సమ్మేళనం' అత్యంత వైభవంగా జరిగింది. గౌతమీ నగర్ కాలనీ వాసుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సమీపంలోని కాలనీల నుండి వందలాది మంది హిందూ కుటుంబాలు తరలిరావడంతో ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభతో కాషాయమయంగా మారింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన చందానగర్ అయ్యప్ప స్వామి దేవాలయ గురుస్వామి ప్రసాద్ రావు జ్యోతి ప్రజ్వలన చేసి సమ్మేళనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి హిందువు తన ధర్మ పరిరక్షణలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. రిటైర్డ్ ఎయిర్‌ఫోర్స్ అధికారి సి.బి.ఆర్.ప్రసాద్ దేశభక్తి ధర్మం పట్ల అవగాహన కల్పించేలా ప్రసంగించగా ఆర్ఎస్ఎస్ ఉప్పల్ బాగ్ సంపర్క్ ప్రముఖ్ , ఎన్.జి.ఐ.టి. అసిస్టెంట్ ప్రొఫెసర్ డి. కుమారస్వామి గుళ్ళపల్లి సమాజంలో హిందూ ఐక్యత యొక్క ప్రాముఖ్యతను దేశం కోసం పోరాడిన వీరుల గాథలను వివరించారు. ఆధ్యాత్మిక గురువు విజయ్ ప్రతాప్ (జల యోగి) తన ప్రసంగంతో భక్తులలో నూతనోత్తేజాన్ని నింపారు. మానసిక ప్రశాంతతకు ఆరోగ్యం, ఆధ్యాత్మికత ఏ విధంగా తోడ్పడతాయో వివరించారు. ఈ సందర్భంగా ఆయన అందరితో 'శ్రీకృష్ణామృతం' పాటకి నృత్యం చేయించగా, భక్తులందరూ తన్మయత్వంతో పులకించిపోయారు. అహంకారాన్ని వీడి ధర్మ మార్గంలో ఎలా నడవాలో ఆయన దిశానిర్దేశం చేశారు. నిర్వాహకుల ఘన సన్మానం ఈ కార్యక్రమంలో అతిథులను 'జనం కోసం' అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కరరెడ్డి, చెన్నారెడ్డి, శశిభూషణ్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమ విజయవంతానికి కృషి చేసిన గౌతమీ నగర్ బస్తీ కమిటీ సభ్యులను వారు అభినందించారు.

**ముఖ్య అతిథులు పాల్గొన్న ప్రముఖులు**

ఈ సమ్మేళనంలో నూనె సురేందర్, కసిరెడ్డి సింధూరెడ్డి, వనమా శ్రీనివాస్ గుప్త, జయకుమార్, వరలక్ష్మీ, సంపత్ కుమార్, సంక మోహన్ రావు, అరవింద్, ధనలక్ష్మి, శివరాజయ్య, వేణుగోపాల్ రావు, పబ్బ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అన్నపూర్ణ ఎన్ క్లవ్, అర్జున్ రెడ్డి కాలనీ, డిఫెన్స్ కాలనీ, ఫ్రెండ్స్ కాలనీ, గౌతమీ నగర్ శిల్పా ఎన్క్లేవ్ సహకాలనీ వాసులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న నాయకులు

## కొమురవెల్లిలో ఘనంగా మహాత్మా బసవేశ్వర్

# జయంతి వేడుకలు

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 20(ప్రభాత ఉదయం):**

"శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణంలో మహాత్మా బసవేశ్వర్ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆదిత్య పరాశ్రీ స్వామి వారు పాల్గొని బసవేశ్వర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా లింగబలిజ సమాజం అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పడిగన్న గారి మల్లేశం, ఆలయ అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు, వీరశైవ లింగ బలిజ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, యువకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహదేవుని శ్రీనివాస్ మాట్లాడుతూ, మహాత్మా బసవేశ్వర్ సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం, సత్యం, సేవాభావం వంటి ఉన్నతమైన విలువలను స్థాపించిన మహనీయుడని కొనియాడారు. ఆయన చూపించిన మార్గం నేటి సమాజానికి ఎంతో అవసరమని, కుల, మత, వర్గ భేదాలు లేకుండా అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. యువత బసవేశ్వర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని, వారి సందేశాలను ప్రతి ఇంటికి చేర్చాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అలాగే ప్రజల మధ్య ఐక్యత, సోదరభావం పెంపొందించడం ద్వారా సమాజం మరింత బలపడుతుందని తెలిపారు.

# తిరుమలలో బ్లాక్ టిక్కెట్ల దందా

## విజిలెన్స్ అధికారులే సూత్రధారులు

## టిటిడి మాజీ చైర్మన్ భూమన ఆరోపణలు

**తిరుపతి,ఏప్రిల్20 (ప్రభాత ఉదయం):**

కూటమి అధికారంలోకి వచ్చాక తిరుమలలో అనేక అపచారాలు జరుగుతున్నాయని ఆరోపించారు టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి. బీఆర్ నాయుడు చైర్మన్ అయ్యాక అపచారాలు పరాకాష్టకు చేరుకున్నాయి. ముఖ్యంగా బ్లాక్ టిక్కెట్ దందాలు పెరిగాయని అన్నారు. 300 రూపాయల టికెట్‌ను మూడు వేలకు అమ్ముకుంటున్నారని అన్నారు. విజిలెన్స్ అధికారులే ఈ పాపానికి ఒడిగడుతున్నారు అంటూ మండిపడ్డారు. టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తిరుపతిలో మీడియాతో మాట్లాడుతూ..'తిరుమలను ప్రక్షాళన చేస్తాం అనేవి కూటమి నేతల మాయమాటలు మాత్రమే. తాబేదారులతో అడ్డూ అదుపు లేకుండా అపచారాలు చేస్తున్నారు. 2008లో నేను పాలకమండలి అధ్యక్షునిగా ఉన్న సమయంలో బాలమురళి కృష్ణను ఆస్థాన విద్వాంసుడిగా నియమించాం. ఆయన చేత ఆలయం ముందు సంగీత కార్యక్రమం నిర్వహించాం. ఇది శాశ్వతంగా ఉండాలని నాదనీరాజన ప్రాంగణం వెలసింది. ఆ వేదికలో సాంస్కృతిక వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసేలా కార్యక్రమం జరుగుతూ వచ్చాయి. ప్రస్తుతం ఆ వేదికపై అవినీతి కంపు కొడుతోంది. దీని కోసం భాస్కర్ అనే అధికారిని నియమించారు. ఆయనకు అర్హత అసలు లేదు. సీఎం, చైర్మన్ అండదండలతో భాస్కర్ పేట్రేగి పోతున్నారు. ప్రోగ్రాం ఇచ్చేందుకే కమిషన్లు, పారితోషికంలో కమిషన్లు తీసుకుంటున్నారు. వీఐపీ, బ్రేక్, 300 రూపాయల దర్శనం టికెట్లు అధిక రేట్లకు విక్రయిస్తున్నారు. 300 టికెట్లను మూడు వేలకు అమ్మేస్తున్నారు. విజిలెన్స్ అధికారులే ఈ పాపానికి ఒడిగడుతున్నారు. శ్రీవాణి టికెట్లను 15 వేలకు అమ్మేస్తున్నారు. ఎస్వీబీసీలో అనర్హులకు పదవి ఇచ్చి నాశనం చేశారు. రూ.50 కోట్లతో ఎస్వీబీసీని స్వయం ప్రతిపత్తి సంస్థగా తీర్చి దిద్దే ప్రయత్నం వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగిందని తెలిపారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

# ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 20 (ప్రభాత ఉదయం):**

ప్రజావాణిలో వివిధ సమస్యలతో వచ్చే ప్రజల అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు.సోమవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాలి ఫిర్యాదులను స్వీకరించి, పరిశీలించారు. ఈ సందర్భంగా (224) అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు కేటాయిస్తూ, ప్రజా సమస్యలపై తగిన చర్యలు తీసుకొని, త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఈ క్రమంలో ప్రజావాణికి వచ్చిన కొన్ని దరఖాస్తుల వివరాలిలా ఉన్నాయి.. ఘనపూర్ (స్టేషన్) మండలం, విశ్వనాథపురం గ్రామంలో నివాసం ఉంటున్న ఓ. వసంత... తమకు ఇల్లు వచ్చేలా చూడాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. సీతారాంపురం గ్రామం, దేవరుప్పుల మండలానికి చెందిన జీడ్డి నాగమ్మ, 2010లో 346 గజాల జాగా కొనుగోలు చేయగా, ఆ భూమిని నాలాగా మార్చుకోవాలని విక్రయదారుడు ప్రయత్నిస్తుండగా, ఆ నాలాను రద్దు చేసి, ఆ వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, తనకు తగిన న్యాయం చేయుట గురించి దరఖాస్తు చేసియున్నారు. ఘనపూర్ (స్టేషన్) మండలం, నమిలిగొండ గ్రామ పంచాయతీ పరిధిలో నివాసం ఉంటున్న గుంటి గట్టయ్య, తనకు 21 గుంటల వారసత్వ భూమి ఉందని...తన పేరు మీదకు భూమిని రిజిస్ట్రేషన్ చేయించగలరని ఆర్జీ ద్వారా కోరారు. కోమళ్ల గ్రామం, రఘునాథపల్లి మండలానికి చెందిన మేకల జయలక్ష్మి, తనకు ఇల్లు లేదని, కటిక పేదరాలు అని, కావున నివాస స్థలం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయగలరని విజ్ఞప్తి చేస్తూ వినతిపత్రం సమర్పించనైనది.జిల్లా కేంద్రంలోని వార్డు నంబర్ 24లో నివాసం ఉంటున్న ఎం. కళ్యాణి, తనకు సొంత స్థలం ఉందని... ఇందిరమ్మ ఇల్లు ఇప్పించగలరని కోరుతూ దరఖాస్తును సమర్పించినారు. ఈ ప్రజావాణిలో ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, ఆర్టీఓ శ్రీనివాస్ గౌడ్, డీఎంహెచ్ఓ మల్లికార్జున రావు, బీసీ సంక్షేమ శాఖ అధికారి ఎన్.ఎల్. నరసింహ రావు, ఎక్సైజ్ ఎస్పీ అనిత, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సిఎం రేవంత్‌తో నార్వే బృందం భేటీ

**హైదరాబాద్,ఏప్రిల్ 20(ప్రభాత ఉదయం):**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నార్వే రాయబారి హెచ్.ఈ. మే-ఎలిన్ స్టైనర్ ప్రతినిధి బృందం కలిసింది. జూబ్లీ హిల్స్ నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసినట్లు తెలిపింది. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధి, పెటుబడులు తదితర పలు అంశాలు ప్రస్తావనకు వచ్చాయి.





# మంచినీటి సమస్యను పరిష్కరించండి

## పాపిరెడ్డి నగర్ అధ్యక్షులు చంద్రారెడ్డి

**కూకట్ పల్లి, ఏప్రిల్ 20 (ప్రభాత ఉదయం)**

వెంకటేశ్వర నగర్ డివిజన్ పాపిరెడ్డి నగర్ లోని బ్లాక్.. సి, రోడ్ నెం.5లో నెలకొని ఉన్న మంచినీటి సమస్యను పరిష్కరించాలని బస్తి అధ్యక్షులు ఊట్ల చంద్రారెడ్డి జలమండలిలో సోమవారం జరుగుతున్న ప్రజాపాలనలో భాగంగా డిజిఎం శ్రీనివాస్ రాజును కలిసి వినతిపత్రాన్ని అందిస్తూ విజ్ఞప్తి చేశారు. ఇదే విషయమై ఇప్పటికే శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ కి వినతినందించమని ,ఆయన అదేశాలమేరకు సోమవారం జలమండలి ప్రజావాణిలో వినతినందించినట్లు చంద్రారెడ్డి తెలిపారు. సమస్య పరిష్కరించేందుకు జలమండలి అధికారులు సానుకూలంగా స్పందించినట్లు చంద్రారెడ్డి తెలియజేశారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ అనిల్, పాపిరెడ్డి నగర్ వాసులు వనం ఆంజనేయులు, భాస్కర్ గుప్తా, రమేష్, ఏ. చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.



## టెక్నాలజికల్ యూనివర్సిటీలో

# కరువైన టెక్నాలజీ

## పీహెచ్‌డీ స్కాలర్స్ చల్లా రామకృష్ణ రెడ్డి

**కూకట్ పల్లి, ఏప్రిల్ 20 (ప్రభాత ఉదయం)**

జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ లో సీసీటీవీ సర్వైలెన్స్ వ్యవస్థలో ఉన్న తీవ్ర లోపాలపై పరిశోధక విద్యార్థులు, బీటెక్ విద్యార్థి ప్రతినిధులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. క్యాంపస్‌లో జరుగుతున్న అనేక ఘటనలకు సరైన ఆధారాలు లేకపోవడానికి ప్రధాన కారణం సమర్థవంతమైన సీసీటీవీ వ్యవస్థ లేకపోవడమేనని వారు పేర్కొన్నారు. కొన్నిచోట్ల సీసీటీవీ ఫుటేజీ రికార్డ్ అయినప్పటికీ, అది తొలగించబడటం లేదా మార్పులు చేయబడటం వంటి ఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇటీవల కిన్నెర హాస్టల్ వద్ద జరిగిన ఘటనలో సీసీటీవీ ఫుటేజీ తొలగించబడినట్లు సమాచారం రావడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తుందని అన్నారు. ఈ నేపథ్యంలో యూనివర్సిటీని "టెక్నాలజికల్ యూనివర్సిటీ"గా పిలుస్తున్నప్పటికీ, ప్రాథమిక భద్రతా టెక్నాలజీ వ్యవస్థలు లేకపోవడం బాధాకరమని విమర్శించారు.విద్యార్థుల భద్రత దృష్ట్యా క్యాంపస్ మొత్తం మీద సమగ్ర సీసీటీవీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా హాస్టల్స్, గేట్లు, గ్రౌండ్స్, అకాడమిక్ బ్లాక్స్, లైబ్రరీ, ఆడిటోరియంలు, ఇతర ముఖ్య ప్రదేశాలలో కెమెరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ముఖ్యంగా సీసీటీవీ ఫుటేజీని సురక్షితంగా నిల్వ చేయడం, కనీసం 90--180 రోజుల వరకు రికార్డులను భద్రపరచడం, ఫుటేజీ యాక్సెస్‌ను ఉన్నతాధికారులకు మాత్రమే పరిమితం చేయడం, సిస్టమ్‌పై క్రమం తప్పకుండా ఆడిట్లు నిర్వహించడం వంటి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్‌కు వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పిథాని సందీప్ గౌడ్, బీటెక్ విద్యార్థులు సాయిరామ్, హర్ష, సంపత్, మనీష్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబుకు వైఎస్ జగన్ శుభాకాంక్షలు

## నేడు పులివెందులకు జగన్

**అమరావతి,ఏప్రిల్20 (ప్రభాత ఉదయం):**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి పుట్టినరోజు సందర్భంగా వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. చంద్రబాబుగారూ.. మీకు పుట్టినరోజు శుభాకాంక్షలు. ఆరోగ్యకరమైన, ప్రశాంతమైన దీర్ఘాయుష్షు మీకు కలగాలని కోరుకుంటున్నా అంటూ ఎక్స్ ఖాతాలో వైఎస్ జగన్ ఓ ట్వీట్ చేశారు. చంద్రబాబు నాయుడికిది 76వ పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఇదిలావుంటే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన సొంత నియోజకవర్గం పులివెందులలో పర్యటించనున్నారు. మూడు రోజుల పాటు ఈ పర్యటన కొనసాగనుంది. తన పర్యటనలో బాగంగా వైఎస్ జగన్ మంగళవారం సాయంత్రం పులివెందులకు చేరుకుంటారు. అక్కడ భాకరాపురం క్యాంప్ ఆఫీస్‌లో ప్రజాదర్బార్ నిర్వహిస్తారు. రాత్రికి అక్కడి నివాసంలో బస చేస్తారు. మరుసటిరోజు22న ఉదయం పులివివెందుల నుంచి బయలుదేరి లింగాల మండలం ఇప్పట్ల వెళతారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నేత సుధాకర్ రెడ్డి ఇటీవలె మరణించారు. ఈ నేపథ్యంలో ఆయన కుటుంబాన్ని వైఎస్ జగన్ ఓదార్చనున్నారు. తిరిగి పులివెందుల క్యాంప్ కార్యాలయానికి చేరుకుని ప్రవిజాదర్బార్ నిర్వహిస్తారు. 23వ తేదీన ఉదయం పర్యటన ముగించుకుని పులివివెందుల నుంచి తిరుగు పయనమవుతారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608